క్లుప్తంగా

మంత్రి పొంగులేటిని కలిసిన ఎమ్మెల్యే



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిలను హైదరాబాద్‌లో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి శనివారం కలిసి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం సచివాలయంలో మైనార్టీ సంక్షేమ ప్రధాన కార్యదర్శి తప్సీర్ ఇక్బాల్‌ను కలిసి నియోజకవర్గంలో మైనార్టీ స్కూల్ అభివృద్ధి, మైనార్టీల సామాజిక ఆర్థికాభివృద్ధి, విద్యార్థుల కోసం విద్యాపరమైన రాయితీల కోసం నిధులు కేటాయించాలని ఆమె కోరారు.

ఉన్నత లక్ష్యంతో చదవండి



జడ్జిలను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు ఇష్టపడి చదువుతూ ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని సత్తుపల్లి ఆరో అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్ సూచించారు. సత్తుపల్లిలోని శ్రీనారాయణ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జి మీరాఖాసీం, డీఐఈఓ రవిబాబు మాట్లాడారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల చైర్మన్ నల్లాన్‌చక్రవరుల రామకృష్ణ, డైరెక్టర్ వనమా రెడ్డి మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు రాజాకృష్ణ, కృష్ణారెడ్డి, నవకుమార్, మోహన్‌రావు పాల్గొన్నారు.

'జేఈఈ'లో సత్తా చాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

కొణిజర్ల: ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో.. మైనారిటీ గురుకుల కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.జితేష్ షాహిల్ తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో లెక్చరర్లు రాధిక, త్రివేణి, ప్రభాకర్, పీడీ రవికుమార్, పీఈటీ సాయి పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



మహాసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కల్లూరు: టీయూసీఐ ఆధ్వర్యంలో హమాలీ సంఘం రాష్ట్ర నాల్గో మహాసభ పోస్టర్లను శనివారం కల్లూరులో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా టీయూసీఐ నాయకుడు జె.మాల్యాద్రి, ఖమ్మంపాటి పుల్లారావులు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాల్గో మహాసభ ఈ నెల 21న ఉదయం 10 గంటలకు ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని, ఈ సభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సత్యం, గోపి, కృష్ణ, అశోక్, వెంకటి, రాంబాబు, వెంకయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కులాంతర వివాహం

చింతకాని: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ముదిరాజ్ కులపెద్దలు శనివారం కులాంతర వివాహం జరిపించారు. గ్రామానికి చెందిన లింగం రవి, అత్తులూరి తేజశ్రీ ప్రేమించుకోగా వేర్వేరు కులాలు కావటంతో కుటుంబీకులు వివాహానికి ఒప్పుకోలేదు. దీంతో ముదిరాజ్ కులపెద్దలను శుక్రవారం ఆశ్రయించగా ఇరువురి కుటుంబసభ్యులను మాట్లాడి ఒప్పించి వివాహం జరిపించారు. వధూవరుల తల్లిదండ్రులు లింగం వెంకటేశ్వర్లు, నర్సమ్మ, అత్తులూరి రామనర్సయ్య, అరుణతో పాటు లింగం రాంబాబు, సింగారపు వీరభద్రం, మేకల సత్యనారాయణ, ప్రసాద్‌రావు, ఈర్ల బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లి అయ్యగారిపేటలోని పురాతన రామాలయం(ఫైల్)



రాతితో నిర్మించిన రామాలయం

సండే స్పెషల్

రాతితో రామాలయం

శిల్పి నూర్ అహ్మద్ నేతృత్వాన పునర్నిర్మాణం

సత్తుపల్లిటౌన్: పూర్వికుల కళను సాకారం చేసేందుకు రాతితోనే రామాలయాన్ని నిర్మించి పూర్వికుల సంకల్పాన్ని సత్తుపల్లిలోని అయ్యగారిపేట వాసులు నిలబెట్టారు. సుమారు 100 ఏళ్ల క్రితం రాతితో ఆలయాన్ని నిర్మించాలని పూర్వికుల ఆలోచనను ఆచరణలో పెట్టారు. అయ్యగారిపేటలోని 90 ఎకరాలలోని పట్టా భూమి అలవాల వాసుదేవరావు, రాధాకృష్ణమూర్తి పేరిట ఉండేది. దానిని మహదేవ రామలింగం, అతని సోదరులు ఒక వాటాగా.. చింతల సూరయ్య, చింతల గోపయ్య మరో వాటాగా, కొల్లి రత్తయ్య, బొంతు వెంకయ్యలు ఇంకో వాటాగా, చల్ల గుళ్ల రామయ్య, గుడిమెట్ల పుల్లయ్య, గుడిమెట్ల రాజయ్య, మోరంపూడి సీతయ్య, సోమరాజు తులసీప్రసాదరావు, నరుకుళ్ల లక్ష్మయ్యలకు ఇలా తొమ్మిది వాటాలుగా ఆ భూమిని కొనుగోలు చేసి పంచుకున్నారు. ఇందులో పశువుల నీటి వసతి కోసం 1.50 ఎకరాల భూమిని కేటాయించారు. మరికొంత భూమిని దారి కోసం తీశారు. మిగతా భూమిని తొమ్మిదిన్నర ఎకరాల చొప్పున తొమ్మిది వాటాలుగా పంచుకున్నారు. కాల క్రమేణ పశువుల నీటి వసతికోసం కేటాయించిన భూమి అన్యాక్రాంతం కాగా 20 కుంటలు మాత్రమే మిగిలింది. పూర్వికులు రాతితో రామాలయం నిర్మించటం కోసం ముక్కోణపు రాతి దిమ్మెలను సైతం గుడివద్దకు చేర్చారు. అయితే కాలక్రమంలో స్థానికులు ఇళ్ల ముందు తేమ పారుదల ఎక్కువగా ఉండటంతో ఇళ్ల ముందు ఆ దిమ్మెలను వాడకానికి వినియోగించారు.

ఆలయ నిర్మాణం కోసం..

అయ్యగారిపేటలోని పురాతన ఆలయాన్ని పునఃనిర్మించాలని పూర్వీకుల కలను నెరవేర్చేందుకు రాతితోనే నిర్మాణం చేపట్టాలని అయ్యగారిపేట వాసులు భావించారు. పూర్వికులు మిగిల్చిన 20 కుంటల భూమిని రూ.70 లక్షలకు అమ్మారు. దీనికి తోడు రైతులు, స్థానికులు, ఎన్‌ఆర్‌ఐలు రూ.50 లక్షల విరాళాలు ఇచ్చారు. ఈ విరాళాల్లో నుంచే రూ.15లక్షలతో ఒక కుంట స్థలంలో ఉన్న రామాలయానికి మరో కుంట స్థలాన్ని కొనుగోలు చేశారు.

18 నెలల్లో పూర్తి..

చిలకలూరిపేటకు చెందిన శిల్పి నూర్ అహ్మద్ నేతృత్వాన ఈ వందేళ్ల రామాలయాన్ని సిమెంట్ ఉపయోగించకుండా ధ్వజస్తంభంతో సహా పూర్తిగా రాతి కట్టడంతో నిర్మించారు. 18 నెలల్లోనే ఈ ఆలయాన్ని పూర్తి చేసి పునఃప్రతిష్ఠతో భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ ఆలయంలో శ్రీసీతారాములు, లక్ష్మణులు, ఆంజనేయస్వామి, విశ్వక్సేణుడు విగ్రహాలను ప్రతిష్ఠించారు. మూల విగ్రహాలను పంచలోహాలతో, ఉత్సవ విగ్రహాలను రాతితో తయారు చేశారు.

పూర్వం నుంచి ఇదే వృత్తి..



దేవాలయాలకు రాతి శిలను చెక్కటమే వృత్తిగా పూర్వం నుంచి వస్తున్న సాంప్రదాయం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిలకూరిపేట మండలం పురుషోత్తం పట్టణంలో సుమారు 20 మంది కార్మికులతో రాతి శిల్పాలను చెక్కుతున్నాం. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో 25కుపైగా దేవాలయాలను రాతితో నిర్మించాం. వీటిలో ఎక్కువ శివాలయాలు, రామాలయాలే ఉన్నాయి.

– నూర్ అహ్మద్, శిల్పి, పురుషోత్తంపట్నం (ఏపీ)

అందరం కలిసికట్టుగా..



అయ్యారిపేటలోని చిన్నాపెద్ద అందరిని కలుపుకొని పూర్వీకుల ఆశయాలకు అనుగుణంగా రామాలయాన్ని నిర్మించాం. శిల్పి నూర్ అహ్మద్ శిల్పకళ నైపుణ్యం చూసి రామాలయం నిర్మాణాన్ని అప్పగించాం. తమిళనాడులోని కుంభకోణంలో పంచలోహ ఉత్సవ విగ్రహాలను, మహాబలిపురంలో రాతితో మూల విగ్రహాలు తయారు చేయించాం.

– చల్లగుండ్ల కృష్ణయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు, సత్తుపల్లి

బాలల సంక్షేమం అందరి బాధ్యత



మాట్లాడుతున్న సీడీపీఓ కనకదుర్గ

వేంసూరు: బాలల సంక్షేమంపై అందరూ బాధ్యత తీసుకోవాలని సత్తుపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ కనకదుర్గ అన్నారు. శనివారం మండలంలోని బీరాపల్లి సెక్టార్ పరిధిలో కల్లూరుగూడెం, కుంచపర్తి జెడ్పీహెచ్ఎస్, కల్లూరుగూడెం ఎంపీపీఎస్‌లలో నిర్వహించిన 'చిన్నారి ముచ్చట్లు' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలకు గుడ్ – బ్యాడ్ టచ్‌లపై, చైల్డ్ హెల్ప్‌లైన్, బాల్య వివాహాల నిర్మూలణ, మాదక ద్రవ్యాలు, సెల్‌ఫోన్ల వాడడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భవాని, హెచ్‌ఎంలు పుల్లారావు, షేక్ లాల్‌మహ్మద్, ఉపాధ్యాయులు రమేష్, ప్రసాద్, వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, వీర వెంకమ్మ, రత్నకుమారి, వాణి, ఏఎన్‌ఎమ్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పరిహారం ఇచ్చే వరకు కదలం

ఆరో రోజుకు చేరిన రిలే దీక్షలు

సత్తుపల్లి: మాకు భూములపై అన్ని హక్కులు ఉన్నాయి.. పరిహారం ఇవ్వకుండా భూములు లాక్కుంటే ఊరుకోమని భూ నిర్వాసితుడు ఎర్రా సూర్యనారాయణ అన్నారు. కొమ్మేపల్లి భూ నిర్వాసితుల రిలే నిరాహార దీక్షలు శనివారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమికి సంబంధించి అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా పరిహారం ఇవ్వకపోవడం దారుణమని, అధికారులు కూడా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. పరిహారం ఇచ్చే వరకు ఆందోళన విరమించేదే లేదన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్ రావు, ప్రసాద్, వసుప్రధారాణి పాల్గొనగా.. రైతు సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు.



నిరాహారదీక్షలో పాల్గొన్న భూ నిర్వాసితులు

దివ్యాంగుడికి చేయూత



దివ్యాంగుడికి స్టాండ్ అందిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం గ్రామానికి దివ్యాంగుడు నర్సింహారావు యాచక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి గతంలో జరిగిన లారీ ప్రమాదంలో కాలు పూర్తిగా తొలగించారు. తను నడిచే స్టాండ్ కూడా ధ్వసమవడంతో విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన దాసరి మధుమోహన్‌రెడ్డి, మధుబాబు.. దివ్యాంగుడికి నూనత స్టాండ్‌ను అందించారు.

సాంబశివరావు సేవలు మరువలేనివి

తల్లాడ: వెంగన్నపేట గ్రామానికి చెందిన కల్యాణపు సాంబశివరావు సేవలు మరువలేనివని మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెంగన్నపేటలో శనివారం నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. తన ఆర్గనైజేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి వెంకట్‌లాల్, ఉపాధ్యాయులు నరసింహారావు, వినోద్‌కుమార్, బాలాజీ, నరేందర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సంతాపం

ఏన్కూరు: మెదక్ జిల్లా చేగుంట మండలంలో సీఆర్పీలుగా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రమేష్, శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఏన్కూరులో శనివారం సమగ్ర శిక్షా ఉద్యోగులు సంతాపం తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి మౌనం పాటించారు. ప్రభుత్వం స్పందించి ఆ రెండు కుటుంబాలకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సమగ్రశిక్షా ఉద్యోగులు రుద్రగిరి, కృష్ణప్రసాద్, హరిత, లత, సుమన్, శివాజీ, మంగతాయారు పాల్గొన్నారు.

నాయకుడికి పరామర్శ..



అనంతరామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఏన్కూరు: మండలంలోని జన్నారానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు గుత్త వెంకటేశ్వరావు.. తండ్రి అనంతరామయ్య శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శ్రద్ధ చూపండి



మాట్లాడుతున్న హెచ్‌ఎం సమద్

సత్తుపల్లిరూరల్: విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కిష్టారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సమద్ అన్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు స్పెషల్ టెస్ట్‌లు నిర్వహించి, గ్రేడ్‌ల వారీగా విభజించామన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందించాలని, ఎలా చదువుతున్నారో పక్కనుండి మరీ తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మీనాక్షి నటరాజన్ నియామకంపై హర్షం

వైరా: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్‌ను నియమించడం పట్ల రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కట్ల సంతోష్ హర్షం వ్యక్తం చేశారు. మీనాక్షి నటరాజన్‌కు తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలపై పూర్తి అవగాహన ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేస్తూ ముందుకు నడుపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమె నియామకానికి కృషి చేసిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.

బర్డ్ ఫ్లూ నివారణకు చర్యలు తీసుకోండి

ఎర్రుపాలెం: బాయిలర్ కోళ్లల్లో వస్తున్న బర్డ్ ఫ్లూ వ్యాధి నివారణకు ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రకృతి వ్యవసాయ రైతు, జిల్లా రైతు సేవా కోఆర్డినేటర్ కుదుముల వెంకట రామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి కారణంగా వేలాదిగా కోళ్లు మృతి చెందుతున్నాయన్నారు. దీంతో కోళ్లఫాం నిర్వాహకులకు నష్టంతో పాటు పర్యావరణ సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందన్నారు. వ్యాధిసోకి మృతిచెందిన కోళ్లను బహిరంగ ప్రదేశాల్లో వేయడం సరికాదన్నారు.

17న ఈజీఎస్ పనుల ఆడిట్‌పై ఓపెన్ ఫోరం

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని ఈజీఎస్ కార్యాలయంలో ఈ నెల 17న ఉదయం 10గంటలకు సామాజిక తనిఖీ ఓపెన్‌ఫోరం నిర్వహించనున్నట్లు ఈజీఎస్ ఏపీఓ కె.నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో 2023 మార్చి నెల నుంచి 2024 మార్చి వరకు గ్రామాల్లో నిర్వహించిన ఉపాధిహామీ పనుల తీరుపై ఇప్పటికే గ్రామాల స్థాయిలో ఆడిట్ జరిగిందని, ఆ ఆడిట్ నివేదికను ఓపెన్ ఫోరంలో చర్చిస్తామని తెలిపారు. ఈ ఓపెన్ ఫోరంకు సకాలంలో అధికారులు, కార్యదర్శులు, ఈజీఎస్ మేట్స్, సిబ్బంది హాజరుకావాలని కోరారు.

కృత్రిమ గర్భధారణతో మేలైన పశువులు



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మమత

కల్లూరురూరల్: పశువుల్లో కృత్రిమ గర్భాధారణ వల్ల మేలు జాతి పశుసంతతిని పొందవచ్చని వెటర్నరీ డాక్టర్ మమత రైతులకు సూచించారు. శనివారం మండలంలోని ఎర్రబంజర గ్రామంలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన గోపాలమిత్ర ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. పశువులు ఎదకు వచ్చినప్పుడు అరవడం, బెదురుగా చూడడం, చిరు మూత్రం పోంయటం, పలుచని తీగలువెయడం లాంటి విషయాలను రైతులు గమనించి సమీపంలోని పశువైద్యశాలలో కానీ లేక అందుబాటులో ఉన్న గోపాల మిత్రులచే కృత్రిమ గర్భధారణ చేయించాలి. ఈ శిబిరంలో 38 పశువులకు గర్భకోశవ్యాధులకు సంబంధించిన చికిత్స నిర్వహించడంతో పాటు.. 42 దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ తుమ్మల వెంకటేశ్వర్లు, గోపాలమిత్రులు వెంకటేశ్వర్లు అప్పారావు, కృష్ణ ప్రసాద్, వెంకటేశ్వర్లు, రవికుమార్, శివకృష్ణ, రమేష్, హనుమంతురావు, రైతులు పాల్గొన్నారు.

మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి



తల్లాడ: అన్నారుగూడెంలో మిర్చి పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కారేపల్లి/తల్లాడ: ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, నాయకుడు అయినాల రామలింగేశ్వరరావు తెలిపారు. శనివారం కారేపల్లి మండలంలోని పలు గ్రామాలతో పాటు.. తల్లాడ మండలంలోని తల్లాడ, అన్నారుగూడెం గ్రామాల్లోని మిర్చి కల్లాలు, తోటలను వారు సందర్శించి, రైతులతో మాట్లాడారు. ఈ నెల 18న ఖమ్మం వ్యవసాయ మార్కెట్ వద్ద నిర్వహించే రైతుల మహాధర్నాను జయప్రదం చేయాలన్నారు. మిర్చి క్వింటాళ్లకు రూ.25వేలు ధర నిర్ణయించి ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. గతేడాది క్వింటాకు రూ.23వేలు ధర పలుకగా.. ఈసారి రూ.12వేలు ధర నిర్ణయించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, సీపీఎం నాయకులు రామారావు, కృష్ణ, సత్యనారాయణ రెడ్డి, కొండయ్య, రవి, రాజేష్, మోహన్ రావు, వెంకటనరసయ్య, వెంకటేశ్వరరావు, హనుమంతురావు, భాస్కర్, వీర్య, గోవింద్ వీరయ్య, శ్రీను, నర్సయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ చైర్మన్‌కు సత్కారం..



శామ్యూల్ జాషువాను సన్మానిస్తున్న పాస్టర్లు

సత్తుపల్లిటౌన్: నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్(ఎన్‌సీసీ) చైర్మన్‌గా నూతనంగా నియమితులైన హోప్ మినిస్ట్రీస్ డైరెక్టర్ శామ్యూల్ జాషువా గద్దంను స్థానిక ఎన్టీఆర్ నగర్ క్రీస్తు సంఘం ప్రార్థనా మందిరంలో పాస్టర్లు శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాతీయ పొలిటికల్ రింగ్ అధ్యక్షుడు అలవాల కరుణాకర్, సత్యానందం, జయదీప్ ముఖర్జీ, నిర్మాలాదేవి, శ్రీనివాస్ పాల్ రాజ్, బేతంపూడి వరప్రసాద్, యాకోబు రవికిరణ్, దేవ సహాయం పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

సత్తుపల్లిరూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదికు పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా సత్తుపల్లి మండలం ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయనను శనివారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, లక్ష్మణ్, దేవన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



పారాయణం చేస్తున్న భక్తులు

కల్లూరు: కల్లూరు పెద్ద చెరువు కట్టమీదున్న శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం పశ్చిమ గోదావరి జిల్లా ప్రగడవరం గ్రామానికి చెందిన ముల్లంగి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భక్త విలాస బృందం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి.

భక్తులకు వసతులు కల్పించాలి

పెనుబల్లి: మండలంలోని నీలాద్రీశ్వరాలయంలో ఈ నెల 26న నిర్వహించనున్న మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను శనివారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు మట్టా దయానంద్ పరిశీలించారు. ఆలయ ఈఓ, ఆలయ చైర్మన్లతో కలిసి ఏర్పాట్లను పరిశీలించి, ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పాకాల వెంకటరమణ, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ జయంతి

బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని.. మండలంలోని పలు గ్రామాల్లో భోగ్ బందారో కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించి, బంజార సంస్కృతి సాంప్రదాయాలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. సేవాలాల్ దేశ సంచారం చేస్తూ గిరిజనులను చైతన్య పరిచిన మహానుభావుడని పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మధిర: సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



పెనుబల్లి: పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు దయానంద్, తదితరులు




కారేపల్లి: పూజలు చేస్తున్న గిరిజనులు

సేవాలాల్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే



ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందిస్తున్న మంత్రి సీతక్క

వైరా: రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యాన హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో శనివారం నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొనగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ దేశం గర్వించదగిన మహనీయుడని ఆయన సేవలను కొనియాడారు.



ముదిగొండలో..



సత్తుపల్లిటౌన్: మెట్టా ఆంజనేయస్వామి గుడి ప్రాంగణంలో బంజారా మహిళలు



బోనకల్‌లో..